క్లుప్తంగా

అడవి గుట్టపై చెలరేగిన మంటలు



గుట్టపై కాలిపోతున్న వృక్షాలు

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీలోని శివలింగాపురం గ్రామ సమీపంలో అడవిలో గుట్టపై సోమవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఇళ్ల సమీపంలో ఉన్న గుట్టపై మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో స్థానికులు భయాందోళన చెందారు. గుట్టపై మంటలకు సంబంధించి అటవీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

అశ్వారావుపేటరూరల్: బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీడీపీఓ రోజా రాణి హెచ్చరించారు. మండలంలోని గుమ్మడవల్లి, కొత్త మామిళ్లవారిగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అనంతారం గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం బాల్య వివాహాలు–వాటి అనర్థాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కనీస వయస్సు లేకుండా వివాహాలు చేస్తే ఆరోగ్య పరమైన, కుటుంబ పరమైన సమస్యలు తలెత్తుతాయని అన్నారు. విద్య, ఉద్యోగాలకు దూరమై మనసిక ఒత్తిడికి గురి అవుతారని వివరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారు, తల్లిదండ్రులు, బంధువులపై కూడా చట్టపరంగా కేసులు నమోదు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎంలు టి.శ్రీనివాసరావు, శేషమ్మ, పి.ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, వరలక్ష్మి, స్వరాజ్యం, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

తునికాకు ధర పెంచాలి

దమ్మపేట: తునికాకు కట్ట ధర పెంచి, కార్మికులను ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో ఆర్ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తునికాకు కార్మికులకు బోనస్ చెల్లించి, ఆకుల సేకరణలో మరణిస్తే పది లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుర్సం ముత్యాలరావు, పండూరి వీరబాబు, నాగమణి, సత్యావతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా గ్రామస్తులను పలకరిస్తూ.. నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే పాయంకు సమస్యలను విన్నవించుకున్నారు. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించాలని, గ్రామ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. శాంతినగర్ ఎస్సీ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఊర చెరువు అలుగు మార్చాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు గ్రామస్తులు అందజేశారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, తాటి బిక్షం, టివి సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యత వహించాలి

దుమ్ముగూడెం: మండలంలోని రామచంద్రునిపేట ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఎం రేసు పార్వతి విధి నిర్వహణలో గాయపడిందని, దీనికి ఐటీడీఏ అధికారులే బాధ్యత వహించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాచలం డివిజన్ నాయకులు సోంది మల్లురు, రేసు ఆదినారాయణ మూర్తిలు డిమాండ్ చేశారు. శనివారం బాధితురాలిని పరామర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా వైద్య చేయడానికి వెళుతున్న పార్వతి వాహనానికి రోడ్డు ప్రమాదం సంభవించిందని, సంఘటనలో ఆమె ఎడమ కాలు, కుడి చెయ్యి బొటనవేలు, మెడ కింద ఎద ఎముకలు విరిగాయయని అన్నారు. ఇప్పటికే ఆమెకు రూ.60 వేల వరకు వైద్య ఖర్చులు అయ్యాయని తెలిపారు. తక్షణమే ఐటీడీఏ అధికారులు స్పందించి వైద్యానికి అయిన ఖర్చులు ఇప్పించడంతోపాటు పార్వతి కోలుకుని విధుల్లో చేరేంత వరకు ఆమెకు పూర్తిస్థాయిలో వేతనం చెల్లించాలని కోరారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

అశ్వాపురం: మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు స్వర్గం బాలనర్సయ్య చేతుల మీదుగా 150 మంది కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు దండి రాములు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కాంతి లేని క్రాంతిపురం

- గ్రామానికి లేని విద్యుత్ కనెక్షన్
- 20 ఏళ్లుగా చీకట్లో మగ్గుతున్న అడవి బిడ్డలు
- సంవత్సరాలుగా పట్టింపులేని పాలకులు



క్రాంతిపురం గ్రామం..

చర్లరూరల్: ఆ గ్రామం ఏర్పాటై ఇరవై సంవత్సరాలైనప్పటికీ నేటికీ ఆ గ్రామానికి కరెంట్ లేకపోవడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కానీ ఇది అక్షరాల నిజం. ఈ గ్రామం చర్ల నుంచి వెంకటాపురం వెళ్లే ప్రధాన రహదారికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న క్రాంతిపురం. ఊరి పేరులో మాత్రమే కాంతి ఉంది కానీ ఆ గ్రామంలో మాత్రం విద్యుత్ సౌకర్యం లేదు. ఏజెన్సీ గ్రామాల్లో నివసించే గిరిజనుల కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్న పాలకులు ఇప్పటికీ విద్యుత్ సౌకర్యానికి నోచుకోని గ్రామాల వైపు చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఇరవై ఏళ్ల క్రితం చర్ల మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడ నివసిస్తున్నప్పటికీ వారికి కనీస సౌకర్యాలు లేక పోవడం బాధాకరం. అరణ్యంలో కనీసం విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో స్థానికులు దినదిన గండంగా గడుపుతున్నారు. అడవితల్లినే నమ్ముకుని ఇన్నేళ్ళుగా జీవిస్తున్న క్రాంతిపురం గిరిజనులు వెలుతురు ఉన్న సమయంలోనే పనులన్నీ ముగించుకోవడం కొంత ఇబ్బందిగా ఉన్నప్పటికీ చేసేది లేక కాలం వెళ్ళదీస్తున్నారు. గ్రామస్తులకు సోలార్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించినప్పటికీ సోలార్ ప్లేట్లు, నీటి ట్యాంకర్ పగిలి పోయి ప్రస్తుతం పనిచేయడం లేదని గ్రామస్తులు తెలిపారు. ప్రతీరోజూ ఏపనికి పోయినప్పటికీ రాత్రి అయ్యేసరికి గ్రామానికి చేరుకోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.క్రాంతిపురంతో పాటు పక్కనే ఉన్న రాజయ్య నగర్‌లలో మొత్తం సుమారు 50 కుటుంబాలు ఇంకా చీకట్లోనే మగ్గుతున్నాయి.

వర్షాకాలంలో దినదిన గండమే..

అసలే కరెంట్ లేక నానా అవస్థలు పడుతున్న క్రాంతిపురం గిరిజనులకు వర్షాకాలం వచ్చిందంటే ఎటునుండి ఏ కష్టం వచ్చిపడుతుందోనని ఆందోళన చెందుతుంటారు. గ్రామానికి ముందుగా ఒక వాగు ప్రవహిస్తూ ఉంది. భారీ వర్షాలు కురిసినట్లైతే గ్రామం నుంచి బయటకు వచ్చే పరిస్థితి కూడా ఉండదు. వర్షాకాలంలో విషసర్పాలు రాత్రి వేళల్లో ఇళ్ళల్లోకి వస్తాయని, అటువంటి సమయంలో నిద్రపోకుండా ఉండే రోజులు కూడా లేకపోలేదని వాపోయారు స్థానికులు. తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని క్రాంతిపురం,రాజయ్యనగర్ గ్రామస్తులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



గత ఇరవై ఏళ్లుగా క్రాంతిపురం గ్రామంలోనే నివసిస్తున్నాం. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. మా గ్రామానికి కరెంటు లేన చిన్న పిల్లలతో ఇబ్బంది పడుతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని భయంగా ఉంది.

– సవక చిన్ని, క్రాంతిపురం

కరెంటు వచ్చేలా చూడండి..



దయచేసి మా గ్రామానికి కరెంటు వచ్చేలా అధికారులు, నాయకులు ప్రయత్నం చేయాలి. 20 ఏళ్ళుగా రాత్రి వేళల్లో దినదిన గండంగా గడుపుతున్న మమ్మల్ని కాపాడండి.ఏళ్ళు గడుస్తున్నాయి కానీ మా కష్టాలను మాత్రం పట్టించుకోవడం లేదు.

– మడకం సురేష్, క్రాంతిపురం

పట్టించుకున్నవారు లేరు..



ఎన్నో ఏళ్లుగా మా గ్రామనికి కరెంటు కావాలని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికలప్పుడు మాత్రం సౌకర్యాలు కల్పిస్తామని చెప్పే వాళ్లే కానీ పట్టించుకోవడం లేదు. ముందుగా మా గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలి.

– పూనెం శారద, క్రాంతిపురం

హరితహారం చెట్లు నరికివేత



అశ్వాపురంలో ప్రధాన రహదారి వెంట విద్యుత్ తీగల కింద నరికిన చెట్లు

అశ్వాపురం: మండల కేంద్రంలో హరితహారంలో భాగంగా మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి మొక్కలు నాటారు. మొక్కలు పెరిగి వృక్షాలు అవుతుండగా విద్యుత్ తీగల కింద ఉన్నాయని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి వెంబడి చెట్లు నరికివేశారు. చెట్లు పెరిగి రహదారి వెంబడి నీడనిచ్చే సమయంలో చెట్లు నరికివేయడంతో పచ్చని చెట్లతో ఉన్న ప్రధాన రహదారి వెలవెలబోయింది. మొక్కలు నాటే ముందు అధికారులు విద్యుత్ తీగల కింద నాటి సంరక్షించి మొక్కలు నాటి, పెంచేందుకు డబ్బులు ఖర్చు చేసి తీరా వృక్షాలుగా మారే సమయంలో నరికివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మొక్కలు నాటే ముందు విద్యుత్ తీగలు, రహదారి వెడల్పులో మొక్కలు పోకుండా నాటడాన్ని సరిచూసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఐటీసీ సహకారం మరువలేనిది..



సిద్ధార్థ మొహంతిని సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

బూర్గంపాడు: ఏజెన్సీ ప్రాంతంలో తలసేమియా, సికిల్ సెల్ నివారణకు రెడ్‌క్రాస్ సంస్థ చేపట్టిన కార్యక్రమాలకు ఐటీసీ పీఎస్‌పీడీ అందించిన సహకారం అభినందనీయమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు అన్నారు. ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ సిద్ధార్థ మొహంతి ఉద్యోగోన్నతిపై ఐటీసీ వైస్ ప్రెసిడెంట్‌గా వెళ్తున్న సందర్భంగా రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడారు. ఐటీసీ పీఎస్‌పీడీ నూతన హెడ్ ప్రణవ్‌శర్మ, ఐటీసీ ఉన్నతాధికారులు శ్యామ్‌కిరణ్, చెంగలరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, ఏ.జగదీష్, డాక్టర్ భానుప్రసాద్, డాక్టర్ రాజశేఖర్, పల్లంటి దేశప్ప, కామేశ్వరరావు, వెంకటరెడ్డి, డాక్టర్ జీవీవీ సుదర్శనరావు, ఆదిప్రసాద్ పాల్గొన్నారు.

నూకాలమ్మ అలంకరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం అమ్మవారు నూకాలమ్మ అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని వివిధ రకాల పూజలు చేశారు. మొక్కులు చెల్లించారు. అలాగే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. జాతర ఉత్సవాలు మూడొవ రోజుకు చేరగా, రాత్రి సమయంలో భక్తులు ఆలయం వద్ద పోటెత్తారు.

ఓసీ–2 సమస్యలు పరిష్కరించాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–2లో నెలకొన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రాజెక్ట్ ఆఫీసర్, ప్రాజెక్ట్ మేనేజర్లకు విడివిడిగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ మాట్లాడుతూ.. కొత్త సైట్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో షిఫ్ట్ సమయాలు మార్చాలన్నారు. పనిచేసే ఏసీలు ఉన్న హెచ్ఈఎంఎలను మాత్రమే కార్మికులకు అలాట్‌మెంట్ చేయాలని కోరారు. నాయకులు మేకల ఈశ్వర్‌రావు, సురేందర్, శ్రీనివాసరావు, బండారి రవికుమార్, ఫిట్ సెక్రటరీ నరేశ్, పాపారావు, సుదీప్, నాగుల సతీష్, బత్తుల కృష్ణ, రవీందర్, కుమార్, నరహరి, హుస్సేన్, కుమారస్వామి పాల్గొన్నారు.

సూర్య పర్యటన

అశ్వాపురం: రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మంత్రి సీతక్క కుమారుడు ధనసరి సూర్య మండలంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి పుట్టిన రోజు వేడుకలు సోమవారం సూర్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అశ్వాపురంలో తన మిత్రుడు దోసపాటి చింటూ కిరాణా దుకాణాన్ని ధనసరి సూర్య సందర్శించి కుటుంబసభ్యుల యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

వైద్య ఖర్చులకు సహకరించరూ..

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన ఎస్‌డీ.సైదాహుస్సేన్ బైక్‌పై కొత్తగూడెం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా.. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. తలకు బలమైన గాయం కావడంతో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆరోగ్యం విషమంగా ఉండటంతో సోమవారం ఖమ్మంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. హుస్సేన్ కుటుంబం రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు దాతల సహాయం కోరుతున్నారు. దాతలు 9392967553 నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పేకు ఆర్థిక సహాయం చేయాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని కుమ్మరిగూడెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. మణుగూరు మండలం సమితిసింగారంకు చెందిన యువకులు చింటూ, సందీప్ బైక్‌పై దుమ్ముగూడెం ఆనకట్ట వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా కుమ్మరిగూడెంలో వంతెన వద్ద అదుపు తప్పి బైక్ చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా 108 వాహనంలో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బీజేపీని ఓడించాలి

దమ్మపేట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా నాయకుడు కొక్కెరపాటి పుల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పుల్లయ్య మాట్లాడుతూ.. కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ము కాస్తున్న బీజేపీని ఓడించాలని, లౌకిక పార్టీలను గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు పిల్లి నాయుడు, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, కేశవరావు, కొప్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

దమ్మపేట: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం దమ్మపేట దమ్మపేట, నల్లకుంటలో రెండు చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటి నిర్వహణను పంచాయతీ సిబ్బంది చూసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: ఇటీవలే పాముకాటుకు గురి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బాధితుడిని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. సోమవారం మండంలోని సుధాపల్లి గ్రామంలో జూపల్లి శ్రీను, ఇటీవలే పాముకాటుకు గురికాగా, ఎమ్మెల్యే జారే ఆయనను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని చెప్పారు. కాంగ్రెస్ మండల నాయకులు కొయ్యల అచ్యుతరావు, కెవి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకలు పంపిణీ



భద్రాచలం(భద్రాచలంటౌన్): సేమియా కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం

బూర్గంపాడు: సారపాక బసప్పక్యాంపులోని మసీద్‌లో సోమవారం పేద ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం తమ సంపాదనలో కొంత జకాత్ రూపంలో పేదలకు పంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ ప్రెసిడెంట్ గుల్ మొహమద్,లాల్ మొహమద్, అబ్దుల్ అజీజ్,రసూల్, టిప్పు సుల్తాన్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పేదలు సైతం రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక కార్పెంటర్స్ అసోషియేషన్ కార్యాలయంలో సోమవారం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు సేమియా కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం ముఖ్య అతిథిగా హాజరై కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మస్తాన్, ఖలీల్, ఇమాన్, బాబాజీ, మైదిన్, అఫ్రీన్, సర్వర్, సుభాని, ఖయ్యూం, పాషా తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలి



పామాయిల్ తోటను పరిశీలిస్తున్న హెచ్ఓ సందీప్

దమ్మపేట: ప్రస్తుతం ఉన్న ఎండ తీవ్రతను తట్టుకొని పామాయిల్ మొక్కలు అధిక దిగుబడిని సాధించాలంటే, మొక్కల చుట్టూ జనుము, జీలుగులు వంటి పచ్చి రొట్ట విత్తనాలు వేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి సందీప్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని పామాయిల్ తోటలను సందర్శించిన హెచ్ఓ రైతులకు పలు సూచనలు చేశారు. పామాయిల్ మొక్క మొదలు నుంచి 2 మీటర్ల దూరంలో పచ్చిరొట్ట విత్తనాలు నాటడం వల్ల తేమను అరకుండా చేసి, అధిక ఉష్ణోగతల నుంచి మొక్కలను తప్పించుకోవడమే కాకుడా దిగుబడిని పెరుగుతుందని పేర్కొన్నారు.

రూ. 151కే తలంబ్రాల ప్యాకెట్

మణుగూరుటౌన్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో ఆధ్వర్యంలో భద్రాచల సీతారామచంద్ర స్వామి తలంబ్రాల పోస్టర్‌ను డిపో మేనేజర్ స్వామి సోమవారం డిపో ఆవరణలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17న భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణం అనంతరం కల్యాణ తలంబ్రాలు కావాల్సిన వారు రూ.151 చెల్లించి ముందుగా బుక్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు మణుగూరు సురక్షా బస్టాండ్‌లోని కార్గో పాయింట్ వద్ద లేదా మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ 9154298588 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కనకదుర్గ ట్రాఫిక్ సూపర్‌వైజర్ కెఎం రావు, హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లు, డీఎంఈ సైదులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



మాట్లాడుతున్న పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్

మణుగూరురూరల్: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పీకేఓసీ పీఓ లక్ష్మీపతి గౌడ్ అన్నారు. సోమవారం ఏరియాలోని పీకేఓసీ బేస్ వర్క్‌షాప్‌లో ముందస్తు రంజాన్ పండుగ వేడుకలను నిర్వహించారు. రంజాన్‌ను పురస్కరించుకుని హిందూ కార్మికులు ముస్లిం ఉద్యోగులకు పండ్లు, హిందూ కార్మికులకు ముస్లిం ఉద్యోగులు సేమియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ.. సింగరేణి తల్లి ఒడిలో ప్రతీ ఒక్కరు సమానులేనన్నారు. కులమతాలకు అతీతంగా ఏరియాలోని గనుల్లో, డిపార్ట్‌మెంట్లలో పండుగలు జరుపుకోవడం హర్షణీయమన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పీకేఓసీ ప్రాజెక్ట్ ఇంజనీర్ జె.వీరభద్రుడు, బేస్‌వర్క్‌షాప్ ఇన్‌చార్జ్ దాసరి రాజశేఖర్, సీనియర్ పీఓ ఎండి.మదార్‌సాహెబ్, ఇస్లావత్ సతీష్‌కుమార్, మల్లికార్జున్, కార్మిక సంఘాల నాయకులు వై.రాంగోపాల్, ఎండి.షాబుద్దీన్, కార్మికులు ఇషాక్, తాజుద్దీన్, గౌస్,దీపక్, నరేష్; నారాయణ, శ్రావణ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు అనుమతులు

గుండాల: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు చొరవతో భట్టుపల్లి నుంచి మామకన్ను వరకు రోడ్డు పనులకు అనుమతులు వచ్చాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ అతహార్ అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో భట్టుపల్లి వయా మర్కోడు రేగళ్ల మీదుగా మామకన్ను వరకు బీటీ రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. కాగా అటవీశాఖ అనుమతులు లేక పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఇటీవల ఇల్లందులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఇల్లందు కాంగ్రెస్ నాయకుడు పేరయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందించామని, స్పందించిన మంత్రి చొరవ తీసుకుని అటవీశాఖ అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.

ఓటే కీలకం..



కరకగూడెం: ఫ్లకార్డులతో ఓటు ప్రాముఖ్యతను వివరిస్తున్న తహసీల్దార్ నాగప్రసాద్

కరకగూడెం: ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం 'మీ తహసీల్దార్ మీ ఇంటికి'అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాటిగూడెం గ్రామంలో ఓటర్లకు ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో కూడా ఓటు ప్రాముఖ్యత తెలుపుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు డిగ్రీ ఫలితాల్లో సత్తాచాటి కళాశాలకే వన్నె తెచ్చారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో మొదటి సెమిస్టర్‌లో జి.శ్రావణి 8.42, మూడో సెమిస్టర్‌లో బి.అఖిల 8.72, ఐదో సెమిస్టర్‌లో టి.వేదవతి 8.62, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ విభాగంలో మొదటి సెమిస్టర్‌లో పూజిత 7.26, మూడో సెమిస్టర్‌లో జయశ్రీ 6.86, ఐదో సెమిస్టర్‌లో సాయి దీపిక 7.82 శాతం మార్కులు సాధించారు. అలాగే బీఏ విభాగంలో మొదటి సెమిస్టర్‌లో తమలిని 8.66, మూడవ సెమిస్టర్‌లో రోహిణి 7.47, ఐదో సెమిస్టర్‌లో వాసవి 7.47, బీకామ్ విభాగంలో మొదటి సెమిస్టర్‌లో పండు 7.31, మూడో సెమిస్టర్‌లో యాసినా 7.51, ఐదవ సెమిసర్‌లో ప్రవళిక 7.90 సీజీపీఏ స్కోర్ చేసిన్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, వీరన్న, నరేందర్ రెడ్డి, శ్యామ్ ప్రసాద్, కామేశ్వరరావు అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిమ్మ ఇళ్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్ అన్నారు. స్థానిక ఏఎంసీ కాలనీలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని చెప్పి పదేళ్లు కాలం గడిపిందని, దీంతో రోజువారి కూలీ పనులు చేసుకునే పేదలు ఇంటి అద్దెలు కరెంట్ బిల్లు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో సామేలు, దసింబాబు, రామకృష్ణ, రాజు, శ్రీను, ఉదయ్, నరేష్, సాగర్, హుస్సేన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసంతో ఆధ్యాత్మికత



మణుగూరుటౌన్: ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



దమ్మపేట: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

మణుగూరుటౌన్: రంజాన్‌మాసంలో ఆచరించే ప్రార్థనలు, ఉపవాసం క్రమశిక్షణను ఆధ్యాత్మికతను పెంపొందిస్తుందని, ఈద్–ఉల్–ఫితర్ సందర్భంగా ముస్లింలు తమ పవిత్ర ప్రార్థనలతో అల్లా దీవెనలు అందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. సోమవారం శేషగిరినగర్‌లోని జామే మసీద్ వద్ద ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ఇస్మాయిల్, అబ్దుల్లా, మహబూబ్, ముస్తఫా, నూరుద్దీన్, మొయిన్, రహీం, బాబ్‌జాన్, కాంగ్రెస్ నాయకులు పిరినాకి నవీన్, శివ సైదులు, సామా శ్రీనివాసరెడ్డి, జీవరత్నం, గాండ్ల సురేశ్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దమ్మపేట: రంజాన్ పవిత్ర మాసంను పురస్కరించుకుని దమ్మపేట మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం దమ్మపేట జామా మసీదులో ముస్లింలతో కలిసి విందును ఆరగించారు. అంతకుముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే రంజాన్ పండుగను అల్లా ఆశీస్సులతో ముస్లింలు కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ముస్లిం మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416